క్లుప్తంగా

ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

భైంసాటౌన్: ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ ఆర్‌ఎం ప్రణీత్ అన్నారు. శుక్రవారం ఇన్‌చార్జి డీఎం ప్రతిమారెడ్డితో కలిసి భైంసా బస్టాండ్‌ను సందర్శించారు. ఈసందర్భంగా బస్టాండ్ ఆవరణలో దుకాణాలను పరిశీలించారు. స్టాళ్ల నిర్వాహకులు వారి హద్దు దాటి ఆక్రమణలు చేయవద్దని సూచించారు. మరుగుదొడ్లకు నీటి వసతి, స్త్రీల మరుగుదొడ్లలో తలుపులు ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు. ఎండల నేపథ్యంలో ప్రయాణికులకు ఉక్కపోత ఇబ్బంది లేకుండా ఫ్యాన్లు ఏర్పాటు చేస్తామని వారు వెల్లడించారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

ఖానాపూర్: ఎన్నికలకోడ్ నేపథ్యంలో మండలంలోని బాదన్‌కుర్తి చెక్‌పోస్ట్ వద్ద అధికారులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. సరిహద్దు ప్రాంతం కావడంతో రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదును వెంట తీసుకెళ్ల వద్దని అధికారులు తెలిపారు.

29 నుంచి కరాటే శిక్షణ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మార్గ్‌లో ఉన్న వివేక్ హైస్కూల్‌లో ఈనెల 29 నుంచి జూన్ 2 వరకు నిర్వహించే ఝాన్సీ లక్ష్మీబాయి ఉచిత కరాటే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని శిక్షకులు కిన్నెర్ల మణాళిని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 12 ఏళ్ల బాలికల నుంచి 25 ఏళ్ల మహిళలకు ఉదయం 6:45 గంటల నుంచి ఉదయం 8:30 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 63040 44255కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

బాసర ఆలయంలో మజ్జిగ పంపిణీ



భక్తులకు మజ్జిగ ప్యాకెట్ ఇస్తున్న అధికారులు

భైంసాటౌన్: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం భక్తులకు మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు వేయించినట్లు ఈవో విజయ రామారావు తెలిపారు. అలాగే ప్రతి శుక్ర, ఆదివారాల్లో అక్షరాభ్యాస మండపాల్లో 5వేల మంది భక్తులకు మజ్జిగ పాకెట్లు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.


వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

భైంసాటౌన్: పట్టణంలోని వాసవినగర్‌లో మూడు రోజులుగా వాసవి కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్ర తి ష్ఠాపన ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హాజరై పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించి తీర్థప్రసాదం అందజేశారు. భక్తులు తరలిరాగా, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపనలో పండితులు, భక్తులు

ఖానాపూర్: మండలంలోని దిలావర్‌పూర్‌లో గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాన మహోత్సవం శుక్రవారం వీడీసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఐదుచేతుల పోచమ్మ, నల్ల పోచమ్మ, ముత్యాల పోచమ్మ, సార్గమ్మల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా పండితులు వెంకటరమణశాస్త్రి, నాగేశ్వరశాస్త్రి పురోహితులు ప్రశాంత్ ఆచారి, బొమ్మెన రాజశేఖర్‌శాస్త్రి, సతీశ్‌శాస్త్రి, సురేశ్ శాస్త్రి చేతుల మీదుగా ప్రతిష్ఠాపన చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న కుంటాలకు చెందిన సాదుల సురేశ్ అనే రైతుకు ఓలా శివారులో వ్యవసాయ భూమి ఉంది. చేనులో ఐదు ఫీట్ల ఎత్తులోనే విద్యుత్ తీగలు ఉన్నాయి. పంట నూర్పిడి చేసేటప్పుడు, పంట ధాన్యాన్ని తరలించేటప్పుడు ఇబ్బందులు తప్పడం లేదని ఆయన వ్యక్తం చేస్తున్నాడు. తీగలను సరిచేయాలని అధికారులను వేడుకుంటున్నాడు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు పెద్ద గజ్జారాం. కుంటాల శివారులో తనకున్న పొలంపై చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. విత్తనాలు వేసేటప్పుడు, కలుపు తీసేటప్పుడు, ఇబ్బందులు పడుతున్నామని వాపోయాడు.

వేలాడుతున్న మృత్యుపాశాలు

- చేల వద్ద ప్రమాదకరంగా విద్యుత్ తీగలు, స్తంభాలు
- రైతులకు పొంచి ఉన్న ముప్పు
- సరిచేయాలని అధికారులకు వేడుకోలు



కుంటాలలో వంగిన స్తంభం

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో వ్యవసాయ భూముల వద్ద చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. మరికొన్ని చోట్ల స్తంభాలు ఓ వైపునకు నేలకొరిగాయి. తీగలు ఒకదానికొకటి తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయి. వేలాడుతున్న తీగలు, ఒరిగిన స్తంభాలను సరిచేయాలని విద్యుత్ అధికారులకు విన్నవించినా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు.

అందే ఎత్తులోనే..

కుంటాల మండలంలో 15 గ్రామపంచాయతీలు ఉన్నాయి. విఠాపూర్, వెంకూర్, కుంటాల, ఓలా, సూర్యాపూర్, రాజాపూర్, అందాకూర్ గ్రామాల్లో పంట పొలాల వద్ద వేలాడుతున్న తీగలు దర్శనమిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో పాతకాలపు విద్యుత్ తీగలు, తక్కువ ఎత్తులో స్తంభాలు ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏయే ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వంగిన విద్యుత్‌స్తంభాలు, వేలాడుతున్న తీగలతో వ్యవసాయ పనులకు ఆటంకంగా మారిందని పేర్కొంటున్నారు. మూగజీవాలు సైతం ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు మేతకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నాయని.. వాటి చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

జరిగిన సంఘటనలివీ..

మండలంలోని గ్రామాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రమాదాలు జరిగి పంటలు కాలిపోతున్నాయి. గతేడాది కుంటాలలో వడ్నం కృష్ణకు చెందిన మొక్కజొన్న చేను దగ్ధమైంది. సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పురవ్వలు వచ్చి చేనులో పడటంతో ఈ ప్రమాదం జరిగింది.

- కుంటాలలో అందారి కృష్ణకు చెందిన మొక్కజొన్న చేనులో విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు వచ్చిపడటంతో పంట మొత్తం కాలిపోయింది. సుమారు రూ.రెండు లక్షల నష్టం వాటిల్లింది.
- వేలాడుతున్న విద్యుత్ తీగలతో పాతవెంకూర్‌లో ఆడెపు రాజేశ్వర్‌కు చెందిన మొక్కజొన్న పంట.. కుంటాలకు చెందిన బోనగిరి కృష్ణుడు పంట కాలిపోయింది.

సమస్య పరిష్కరిస్తాం

స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాం. క్షేత్రస్థాయిలో పంట చేన్లలో పర్యటించి వంగిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేస్తాం. రైతులకు ఇబ్బంది కల్గకుండా వారి సమస్య పరిష్కరిస్తాం. – శివప్రసాద్, విద్యుత్ ఏఈ

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం



శివాజీనగర్‌లో ప్రచారం చేస్తున్న శ్రేణులు



భైంసాలో మాట్లాడుతున్న ఆనంద్‌రావు పటేల్

ఖానాపూర్: పట్టణంలోని పలు వార్డుల్లో ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించాలని కోరుతూ శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, పార్టీ మండల అధ్యక్షులు దయానంద్ ఆధ్వర్యంలో కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సంతోశ్, నాయకులు రమేశ్, లక్ష్మణ్, కిశోర్, యూసుఫ్‌ఖాన్, శంకర్, గంగాధర్, శేషాద్రి, శరత్, రాజేశ్, చంటీ, షబ్బీర్‌పాషా, గంగనర్సయ్య, రవి, సలీంఖాన్, సత్యనారాయణ, వెంకటప్పయ్య, రాజేందర్‌గౌడ్, రవి, అయూమ్, తదితరులు ఉన్నారు.

సారంగపూర్: ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, సారంగాపూర్ జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జామ్ గ్రామంలో శుక్రవారం పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు వివరించారు. వారి వెంట పలువురు నాయకులు రాజు లస్మన్న, గంగాధర్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

భైంసాటౌన్: ఆదిలాబాద్ ఎంపీగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సుగుణ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు సిందే ఆనంద్‌రావు పాటిల్, మాజీ జెడ్పీటీసీ సూర్యకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన బూత్ స్థాయి సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాంకుమార్, ప్రసాద్ పాటిల్, అమేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, దుప్పే గణేశ్, ప్రవీణ్‌కుమార్, సదాశివ్, కోఆప్షన్ సభ్యులు గజానంద్, శ్రీనివాస్‌రెడ్డి, సతీశ్, రాజేందర్, సాహెబ్‌రావ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి సుగుణను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపాటిల్ ఆదేశాల మేరకు మండలంలోని విఠోలి, విఠోలితండా, రాజుతండా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ప్రేమ్‌నాథ్‌రెడ్డి, వెంకటేశ్, దిగంబర్, గోవింద్‌పటేల్, రాజేశ్వర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు

- సాసర్‌పిట్‌లు, సోలార్‌పంపుల ద్వారా నీటిని అందిస్తున్న అటవీశాఖ
- వేసవిలో అటవీజంతువుల దాహం తీరుస్తున్న అధికారులు



మామడ అటవీక్షేత్ర పరిధిలో ఏర్పాటు చేసిన సోలార్‌పంపు



సాసర్‌పిట్‌లో నీటిని నింపిస్తున్న సిబ్బంది



దాహం తీర్చుకుంటున్న అటవీజంతువులు

మామడ: వేసవి కావడంతో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండల కారణంగా అడవిలో నీటి వనరుల లభ్యత తగ్గడంతో వన్యప్రాణులు దాహార్తి తీర్చుకునేందుకు అల్లాడుతున్నాయి. దీంతో వన్యప్రాణులు జనవాసాల్లోకి వచ్చి వేటగాళ్లకు చిక్కి ప్రమాదాల బారిన పడుతున్నాయి. వేసవి తాపం నుంచి వన్యప్రాణులను సంరక్షించి వాటి దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సాసర్‌పిట్‌లు, సోలార్ పంపు సెట్‌ల ద్వారా అటవీ జంతువులకు నీరు అందిస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు..

జిల్లాలోని అటవీ ప్రాంతంలో జింకలు, నీలుగాయిలు, సాంబార్‌లు, అటవీకుక్కలు, ఎలుగుబంటులు, అడవిపందులు, కొండ గొర్రెలు, చిరుతపులులు, నక్కలు వంటి జంతువులు ఎక్కువగా ఉన్నాయి. సాధారణంగా వేసవిలో చెరువులు, కుంటల్లో నీరు ఇంకిపోతాయి. దీంతో అడవిలో జంతువుల దాహార్తి తీర్చేందుకు సాసర్‌పిట్‌లు, సోలార్‌పంపులు, చెలిమెలను వినియోగంలోకి తేవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయినట్లు అటవీశాఖ సిబ్బంది పేర్కొన్నారు. దీంతో సిబ్బంది నీటి వనరులను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

సాసర్‌పిట్‌లు, సోలార్‌పంపుల ద్వారా..

మామడ మండలంలో మామడ, దిమ్మదుర్తి అటవీ క్షేత్ర కార్యాలయాలు ఉన్నాయి. దిమ్మదుర్తి అటవీ క్షేత్ర పరిధిలో పొన్కల్, దిమ్మదుర్తి, సింగాపూర్ అటవీ సెక్షన్‌లు ఉండగా.. మామడ అటవీక్షేత్ర పరిధిలో మామడ, ఆరేపల్లి, మేడిపల్లి సెక్షన్‌లు ఉన్నాయి. దిమ్మదుర్తి క్షేత్ర పరిధిలో 14 సాసర్‌పిట్‌లు ఉండగా..3 సోలార్ పంపులను అమర్చారు.

మామడ అటవీక్షేత్ర పరిధిలో 15 సాసర్‌పిట్‌లు, 2 సోలార్ పంపుల ద్వారా వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసి నీటిని ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. అటవీశాఖ, ఈజీఎస్ నిధులతో నీటికుంటలను నిర్మించారు. చెలిమెలు తవ్వించడం ద్వారా నీటి వనరులు పెరిగాయి. ఈ నీటి కుంటల ద్వారా వన్యప్రాణులు దాహార్తిని తీర్చుకుంటున్నాయి.

ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి సాసర్‌పిట్‌లలో నింపి నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని నల్దుర్తి అటవీ ప్రాంతంలో ఉన్న తురగ చెరువు సమీపంలోకి వన్యప్రాణులు దాహార్తిని తీర్చుకునేందుకు వస్తుంటాయి. ఈ చెరువు పరిసరాలలోకి వేటగాళ్లు రాకుండా నిఘా పెంచారు. ఈ అటవీ ప్రాంతం సమీపంలో సరస్వతీ కాలువ ఉండటంతో కూడా వన్యప్రాణులు దాహార్తిని తీర్చుకునేందుకు సౌకర్యంగా ఉంది.

దాహార్తి తీర్చేందుకు ఏర్పాట్లు చేశాము



ఎండల తీవ్రత పెరగడంతో అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు సాసర్‌పిట్‌లు, సోలార్‌పంప్‌సెట్‌లు, చెలిమెలు, కుంటలు వంటి నీటి వనరులను ఏ ర్పాటు చేయించాం. సాసర్‌పిట్‌లలో నీటిని సిద్ధంగా ఉంచుతున్నాం. దీంతో జంతువులు రో జు వచ్చి దాహార్తిని తీర్చుకుంటున్నాయి.

– అవినాష్, ఎఫ్ఆర్‌ఓ, మామడ

‘సక్కు గెలుపునకు సహకరించండి’



జాబీర్ అహ్మద్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి సక్కు

భైంసాటౌన్: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు సహకరించాలని మాజీ మంత్రి జోగు రామన్న.. భైంసా మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్‌ను కోరారు. గురువారం రాత్రి ఎంపీ అభ్యర్థి సక్కుతో కలిసి పట్టణంలోని వైస్‌చైర్మన్ నివాసంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలపాలని కోరారు. స్పందించిన ఆయన పార్టీ అధిష్ఠానం ఆదేశం మేరకు నిర్ణయం తీసుకుంటానని బదులిచ్చారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తాం

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

తానూరు: నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని భోసి గ్రామంలో ఇటీవల నిర్మించిన మహాదేవుడి ఆలయంలో ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. సొసైటీ వైస్‌చైర్మన్ నాగనాథ్, శివాజీ పటేల్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు



చెరువులో కొనసాగుతున్న మరమ్మతులు

కడెం: మండలంలోని కన్నాపూర్ చెరువులో ఉన్న మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు కొనసాగుతున్నాయి. ఆరు నెలలుగా చెరువులో పైపులైన్‌కు లీకేజీతో ఏర్పడి నీరంతా వృథా పోతుంది. ప్ర స్తుతం చెరువులో నీటిమట్టం తగ్గడంతో భగీరథ అ ధికారులు మరమ్మతులు చేపట్టారు. దీంతో గత మూడు రోజులుగా కడెం, దస్తురాబాద్, జన్నారం మండలాలకు మిషన్ భగీరథ జలం సరఫరా కావ డం లేదు. శుక్రవారం రాత్రి వరకు మరమ్మతులు పూర్తి చేసి.. శనివారం మధ్యాహ్నం కల్లా నీటిని సరఫరా చేస్తామని భగీరథ గ్రిడ్ డీఈ వెంకటరమణ తెలిపారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



మన్మద్‌లో అవగాహన కల్పిస్తున్న జ్యోతి



ఖానాపూర్: అవగాహన కల్పిస్తున్న అధికారులు

లోకేశ్వరం: బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని మిషన్‌శక్తి ఇన్‌చార్జి జ్యోతి అన్నారు. శుక్రవారం మండలంలోని మన్మద్ గ్రామంలో మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో కిశోర బాలికలకు బాల్యవివాహాలతో కలిగే నష్టాలపై అవగాహన స ద స్సు నిర్వహించారు. ఈసందర్భంగా జ్యోతి మాట్లాడుతూ మహిళా హక్కు, లింగ వివక్ష, లింగ సమానత్వం, హెల్ప్‌లైన్ నెంబర్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపవైజర్ శ్రీలక్ష్మి, మౌనిక అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

దిలావర్‌పూర్‌లో..

ఖానాపూర్: మండలంలోని దిలావార్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. మిషన్ శక్తి ఇన్‌చార్జి శైలజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత మాట్లాడారు. బాల్య వివాహాలు చేస్తే డయల్ 100కు, లేదా 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కేంద్రం టీచర్ లక్ష్మి, తదితరులు ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో వీడీసీ నాయకుల ఫిర్యాదు

ఖానాపూర్: తిమ్మాపూర్ ప్రాంతంలో ఉన్న ఖానాపూర్ వీడీసీస్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని వీడీసీ నాయకులు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఖానాపూర్ వీడీసీ పరిధిలోని 15 కులసంఘాల ఆధ్వర్యంలో పశువుల విశ్రాంతి(మందోట) స్థలానికి ఇటీవల వీడీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంచెను ధ్వంసం చేసిన ఘటనపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీడీసీ అధ్యక్షుడు సతీశ్‌రావు దేశ్‌పాండే, గుమ్ముల రాజేందర్, ఒల్లాల చిన్ననర్సాగౌడ్, మైలారపు గంగాధర్, నేత శ్యాం, లాండేరి కిషన్, శంకర్, శ్రీనివాస్, నరేశ్ ఉన్నారు.

సీఎంతో సోషల్ మీడియా కన్వీనర్ల సమావేశం

కడెం: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో శుక్రవారం నిర్వహించిన టీపీసీసీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ల సమావేశంలో ఖానాపూర్ నియోజవర్గ సోషల్ మీడియా కన్వీనర్ మహేశ్ సొన్న పాల్గొన్నారు. టీపీసీసీ రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి పెట్టం నవీన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి సోషల్ మీడియా కన్వీనర్లకు పలు సలహాలు, సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సీఎం పిలుపునిచ్చినట్లు తెలిపారు.

ఎస్‌బీఐలో సర్వర్ సమస్య..!



బ్యాంకు ప్రవేశమార్గం వద్ద అతికించిన పోస్టర్



సర్వర్ పనిచేయకపోవడంతో తిరిగి ఇళ్లకు వెళ్తున్న ఖాతాదారులు

భైంసాటౌన్: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఎస్‌బీఐ శా ఖలో శుక్రవారం సర్వర్ సమస్య తలెత్తింది. దీంతో వివిధ లా వాదేవీల నిమిత్తం బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులు సేవలు అందక ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సమస్య నెలకొనడంతో ఖాతాదారులు తిరిగి వెళ్లిపోయారు. ఈ విషయ మై బ్రాంచ్ మేనేజర్ రవిశంకర్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. మధ్యాహ్నం నుంచి తిరిగి సేవలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల ఎంపిక

ముధోల్: మండలంలోని వడ్తాలలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఐదో తరగతిలో ప్రవేశం పొందేందుకు నిర్వహించిన గురుకుల ప్రవేశపరీక్షలో ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం ఆనంద్ తెలిపారు. 40 మంది పరీక్ష రాయగా 30 మంది ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా వారిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నీరడి వాణిసత్యం, విఠల్‌రెడ్డి, రమణారెడ్డి, వడ్తాల బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడు శ్రీను, మధు పలువురు నాయకులు ఉన్నారు.

మద్యం పట్టివేత

నర్సాపూర్(జి):మండలంలోని రాంపూర్‌లో శుక్రవారం బోస్లే ది లీప్ నుంచి రూ. 4920 విలువైన అక్రమ మద్యం స్వా ధీనం చేసుకున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపా రు. పక్కా సమాచారంతో చేపట్టిన తనిఖీల్లో సిబ్బంది రవీందర్‌రెడ్డి, మహేందర్ పాల్గొన్నట్లు పేర్కొన్నారు.